సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

ఆల్ ది బెస్ట్



పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. సోమవారం ప్రారంభం కానున్న పరీక్షలకు నియోజకవర్గంలోని గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో సగటున 222 మంది చొప్పున మొత్తం కేంద్రాల్లో 5,555 మంది పరీక్షలు రాయనున్నారు.

- నియోజకవర్గంలో 25 కేంద్రాలు
- హాజరు కానున్న 5,555 మంది విద్యార్థులు
- రేపటి నుంచి పరీక్షలు

గాజువాక: గాజువాక మండలంలో 19 పరీక్షా కేంద్రాలు, పెదగంట్యాడ మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రంలోకి ఉదయం 8.30 నుంచి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలను పక్కాగా ఏర్పాటు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం తెలిపారు. విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తం 15 మంది స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలు నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లకు చేరాయి. కాగా, పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ఓఆర్ఎస్ సాచెట్లు అందుబాటులో ఉంచుతారు. హాల్ టికెట్ ఆధారంగా ఆర్టీసీ ఉచితంగా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తోంది. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు.




144 సెక్షన్ అమలు

పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో 14 కేంద్రాలు, దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేంద్రాలు, స్టీల్‌ప్లాంట్ స్టేషన్ పరిధిలో నాలుగు కేంద్రాలు, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కేంద్రాల వద్ద పోలీసు ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ ఉత్తర్వులు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమల్లో ఉంటాయి. పరీక్షలు ముగిసేవరకు పోలీసు ఆంక్షలు కొనసాగుతాయి. ఆ సమయాల్లో పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినా, అనధికార సమావేశాలు నిర్వహించినా, స్లిప్పులు అందించడానికి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటారని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

అరిగేవి ఆరగించు.. సత్ఫలితాలు సాధించు

పరీక్షా సమయంలో విద్యార్థులు ఆహార నియమాలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. సాత్వికాహారమే మేలని సూచిస్తున్నారు. చికెన్, మటన్‌తో పాటు అధిక పిండి పదార్థాలతో కూడిన ఆహారం, నూనె వస్తువులకు దూరంగా ఉండాలి. వీటివల్ల అధిక నిద్ర, గ్యాస్ట్రైటిస్ సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఆహారాల్లో పంచదార, ఉప్పు తగ్గించుకోవాలి. ప్రాసెస్డ్, జంక్, ఫాస్ట్, ప్యాకేజ్ ఆహారాలను తీసుకోకూడదు. పిజ్జా, బర్గర్, వడాపావ్, సమోసా వంటి క్రేవింగ్స్‌కు దూరంగా ఉండాలి. ఇవి జీర్ణశక్తిని తగ్గించి ఏకాగ్రతను దెబ్బ తీస్తాయని చెబుతున్నారు. మైదా, వెన్న, పంచదారతో చేసిన బేకరి పదార్థాలు, స్వీట్లకు కూడా దూరంగా ఉండాలి. వాటిలోని కొవ్వులు, తీపివల్ల ఆ క్షణానికి హుషారుగా అనిపించినా మెదడు కణాలు నిస్తేజంగా మారుతాయి. ఈ పదార్థాల వల్ల అధ్యయన, జ్ఞాపకశక్తి సామర్థ్యాలు తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఉప్మా, పోహా, ఇడ్లీ వంటివాటిని కూరగాయలు, ఆకు కూరలు కలిపి వండి బ్రేక్‌ఫాస్ట్‌గా ఇవ్వాలని న్యూట్రీషియన్లు సూచిస్తున్నారు. వీటితోపాటు ఇంట్లో ప్రతిరోజు ఇచ్చే తేలికపాటి సాధారణ ఆహారాన్ని పిల్లలకు ఇస్తే బాగుంటుందని వైద్యులు చెబుతున్నారు.



క్లుప్తంగా

అవగాహనతో మోసానికి కళ్లెం



వినియోగదారుల హక్కులను వివరిస్తున్న హెచ్‌ఎం కూరపాటి వినోద్ కుమార్

పెదగంట్యాడ: వినియోగదారులు విధిగా హక్కులు తెలుసుకోవాలని, ఏ వస్తువు కొన్నా బిల్లు తీసుకోవాలని చేపలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కూరపాటి వినోద్ కుమార్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులను విద్యార్థులకు వివరించారు.అవగాహనతో ఉండడం వల్ల తూకాలు, వస్తువులు కొనుగోలు సమయంలో మోసాలకు కళ్లెం వేయవచ్చునన్నారు. కార్యక్రమంలో బుడగట్ల హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న 88వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాడి నూకరాజు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో నిర్మించ తలపెట్టిన శ్రీ లక్ష్మీ గణపతి లలిత కామేశ్వరి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పనులకు శనివారం భూమి పూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాడి నూకరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కనుబోతు రామారావు, బత్తిన అప్పారావు, శనివాడ రాము, సత్యనారాయణ, ఆలయ కమిటీ, నిర్మాణ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

'సిటీ బస్సులు నడపాలి'

అగనంపూడి: ఎన్టీపీసీ, లంకెలపాలెం, పరవాడ నుంచి అగనంపూడి, దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–1 మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సిటీ బస్సులు నడపాలని తూర్పుకోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. సిటీ బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని వివరించారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సబ్బవరం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ప్లాట్‌ఫారం–4, ఎన్టీబీఎల్, షీలానగర్,ఎన్ఏడీ కొత్తరోడ్డు మీదుగా వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని, రెండు రూట్లలో సిటీ బస్సులు నడపాలని ఆయన కోరారు.

ఘనంగా అన్న సమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో వేంచేసియున్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అన్నసంతర్పణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎన్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి అతి ప్రీతిపాత్రమైన రోజు శనివారం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. వేకువ జాము నుంచే శ్రీవారికి తోమాల సేవ, సుప్రభాత సేవ నిర్వహించారు. భక్తులు విష్ణు సహస్రనామార్చన పఠించారు. విశేష పుష్పాలతో తిరుమలేశుడిని అలంకరించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, చింతలపూడి తదితరులు

గాజువాక: మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక కణితి రోడ్‌లోని మదీనా మసీదు, మదీనా యూత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యాలను చాటి చెబుతుందన్నారు. గాజువాక ప్రాంతంలో షాదీఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక సీఐ పార్థసారథి, మైనార్టీ నాయకులు ఐహెచ్ ఫారూఖీ, రజీవుల్లా, షౌకత్ అలీ, ఆరిఫ్, పీర్‌బాబా, మున్వర్, మిస్కిన్, సలీమ్, ఆసిఫ్, మదీనావలి, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

18న పైడిమాంబ అమ్మవారి జాతర



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి శంకరనారాయణ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతరను ఈ నెల 18న ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్లు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ, అచ్చింనాయుడు మాట్లాడుతూ ఈ నెల 18 వరకూ ప్రతి రోజూ అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించనున్నామని చెప్పారు. 15న రామాంజనేయ యుద్ధం, సత్య హరిశ్చంద్ర నాటికలను ప్రదర్శించనున్నామన్నారు. 16న నడుపూరు ట్రూపు వారిచే కలహాల కాపురం నాటిక ఏర్పాటు చేశామన్నారు. 17న సోమవారం రాత్రి తొలేళ్ల సందర్భంగా బుర్రకథ, రేలారే రేలా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18న అమ్మవారి జాతర మహోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీపైడిమాంబ సమైక్యత సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి గోపి, ములగపాక ప్రసాద్, పీతరమణ, బత్తిన నాగభూషణం, బొడ్డు కృష్ణారావు, తాటికొండ సుదర్శన్, బత్తిన భానుకిరణ్, బాబూరావు, రామారావు, పల్లం గోపి, కులుకూరి శ్రీను, జనపరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ప్రధాన రహదారికి మహర్దశ



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు అజెండా కాపీ అందజేస్తున్న ఆటోనగర్ ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ప్రధాన రహదారికి మహర్దశ పట్టనుంది. రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనుల అజెండా కాపీని శనివారం పలాసలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, పారిశ్రామిక వేత్త వై.వెంకన్న చౌదరి అందజేశారు. ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి సెయిల్ జంక్షన్ వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రికి వివరించారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభమవుతాయని తెలిపారు.

భూకబ్జాకు పాల్పడిన ముఠాపై కేసు నమోదు

కూర్మన్నపాలెం: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్న ముఠాపై శనివారం దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం దిబ్బపాలెంలో నాగళ్ల గీతామని, కర్రి నాగమ్మలకు చెందిన స్థలాలను ఆరుగురు ముఠా సభ్యులు అన్ని రకాల నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన గీతామని, నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ఆర్ కార్డుల ద్వారా లభించిన 1294, 1295 ప్లాట్లను కబ్జాచేశారని పేర్కొన్నారు. రామచంద్రరాజు, చేకూరి వెంకటనరసమ్మ, ఈగల లక్ష్మి, మాణిక్యం, వెలుగుల పరశురాం, ఈగల హేమ ముఠాగా ఏర్పడి నకిలీ ధ్రువపత్రాలతో భూమి కబ్జా చేశారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు

మద్దిలపాలెం: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సయుక్తంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువులోనూ లోపం లేకుండా సరైన ధర తూకం కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. కాలుష్య నియంత్రణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన గురించి వివరించారు. గౌరవ అతిథి అంబేద్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, స్థిరమైన జీవనశైలి ఎలా పెంపొందించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల రక్షణ మండలి సెక్రటరీ లింగేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల అవగాహన, రక్షణ మండలి పాత్ర గురించి తెలియజేశారు. వినియోగదారుల రక్షణ మండలి ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర మాట్లాడుతూ మండలి ద్వారా చాలా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. వాణిజ్య విభాగాధిపతి జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా జరిగే మోసాలను ఎలా నియంత్రించాలో విద్యార్థులకు వివరించారు. ఎలక్యూషన్, వ్యాసరచన పోటీల్లో గెలుపు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వినయోగదారుల క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్, డాక్టర్ కె.రవిబాబు, వాణిజ్య విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో శక్తియాప్ రిజిస్ట్రేషన్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం 'శక్తి యాప్' రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల పాల్గొని శక్తి యాప్‌లో ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. తద్వారా అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ విభాగం ద్వారా సులభంగా బయటపడవచ్చని సూచించారు. ఎస్సై కోనేటి నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి: స్థానిక మంగళపాలెం 33కేవీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొత్త ఫీడర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, మంగళపాలెం, దువ్వాడ సెక్టార్–1, వెదుళ్ల నరవ, శెట్టివానిపాలెం, గంగవరం, అజనగిరి, వి.కొత్తూరు గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగా ఫీడర్ ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ సమస్యలు చాలా వరకు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు.

అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ లైన్ల వల్ల ప్రమాదాలు తగ్గడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు.ప్రమాదాలు కూడా తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.శ్యాంబాబు, జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు, యూజీ కేబుల్ ఈఈ వేణుగోపాల్, ఆటోనగర్ డీఈ కె.రామకృష్ణ, ఏఈ జి.చంద్రశేఖర్, మింది ఏఈ లోకేష్, కరణం ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం కుట్ర

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



దీక్షాశిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీవీ రాఘవులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగకుండా కుట్ర జరుగుతోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీ ఒక మోసమని అభివర్ణించారు. ఈ కుట్రను సమష్టిగా ఎదుర్కొనేందుకు అన్ని రకాల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాలు, సంస్థ మనుగడ ముఖ్యమన్నారు. దాన్ని పట్టించుకోకుండా కార్మికులను తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్త చేశారు. దేశం అగ్రస్థానంలో నిలవాలంటే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో కొనసాగాలన్నారు. అందుకు అవసరమైన పోరాటాల్లో సీపీఎం కచ్చితంగా కీలక భూమిక పోషిస్తుందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు అంతా ముందుకు రావాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, శ్రీనివాసరావు, ప్రసాద్, వై.టీ. దాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ ఉక్కుకు ఊతమివ్వని ప్యాకేజీ అనే పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న ట్రాఫిక్ విభాగాధిపతి విజయ్ కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించిన ట్రాఫిక్ విభాగం ఉద్యోగులను ఆ విభాగాధిపతి విజయ్‌కుమార్ శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పని ప్రదేశంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజు, పవన్ కుమార్, రవి కుమార్, నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



ఐలా భవనం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఐలా అధికారులు, పారిశ్రామిక వేత్తలు



ర్యాలీ నిర్వహిస్తున్న అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా కమిషనర్ కిషోర్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐలా భవనం నుంచి అధికారులు, సిబ్బంది, పారిశ్రామిక వేత్తలతో ర్యాలీ నిర్వహించారు. ఐలా భవనం వద్ద స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వాసివా కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, పారిశ్రామిక వేత్తలు ప్రశాంత్ కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం అంటూ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇస్మాయిల్, వేణు, దేముళ్లు, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ప్రజలు స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు రామాలయం ప్రాంగణంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, జోనల్ కమిషనర్ శేషాద్రి, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కిల్లాన ముసలయ్య పాల్గొన్నారు.



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ భారతి

పరిశుభ్రతతో ఆరోగ్యం

అగనంపూడి: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తా చెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి డి.వి.ఎస్.ఎన్.రాజు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



నారసంచులు పంపిణీ చేస్తున్న ఫార్మా విద్యార్థులు

- దువ్వాడ విజ్ఞాన్ ఎంఫార్మసీ, బీ ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు ప్రారంభించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి పాల్గొన్నారు.
- 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో ప్లకార్డులతో నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ ఎం.ముత్యాలునాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ గొలగాని అప్పారావు, త్రిమూర్తులు, శేఖర్ పాల్గొన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



ప్రత్యేక గౌన్లు, క్యాపులతో బాల బాలికలు

ఉక్కునగరం: స్థానిక డీపాల్ పాఠశాలలో శనివారం కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలలు ప్రత్యేక గౌన్లు, క్యాపులు ధరించి సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అనీష్ మాథ్యూ, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ సాజి, ఫాదర్ ప్రవీణ్ చేతుల మీదుగా సావనీర్లు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.